


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంచిక : 4 సంపుటి : 6 పుష్పం : 8 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు,
జువ్వలపాలెం, 26-10-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన దేహం పంచకోశములతో నిర్మించబడినది. పంచకోశములను దాటి మన హృదయంలో పరమాత్మ ఉంది. దేహబుద్ధిని విడిచిపెడితే పంచకోశములను విడిచిపెట్టినట్లే. మనకు అనేక తలంపులు వస్తున్నాయి. దేహము నేను అనేది మొదటితలంపు. దీనిని ఆదారం చేసుకొని ఇతర తలంపులు వస్తాయి. అక్కడ నుండే మనకు మోహం ప్రారంభమవుతుంది. మన బుద్ధి దేహానికి పరిమితమై ఉంటుంది. ఆ బుద్ధి తగ్గాలంటే నిష్కామకర్మ చేయాలి. సకామకర్మ బంధిస్తుంది. నిష్కామకర్మ మోక్షాన్ని ఇస్తుంది. మనం సకామకర్మ చేస్తాము. అందువలన బంధంలో పడతాము. నిష్కామకర్మ చేస్తూ ఉంటే మనకు చిత్తశుద్ధి కలుగుతుంది, ఇంద్రియనిగ్రహం కలుగుతుంది, జ్ఞానం కలుగుతుంది. సకామకర్మ చేస్తూ ఉంటే మమకారం పెరుగుతుంది. నిష్కామకర్మ చేస్తూ ఉంటే మమకారం తగ్గుతుంది. నేను అంటే అహంభావన, నాది అంటే మమకారం. ఈరెండే మానవుడిని సంసారంలో బంధిస్తాయి. మమకారం ఉన్నవాడు జీవుడుగా ఉంటాడు. ఎంతకాలమైతే మమకారంలో ఉంటాడో వాడుబంధంలో ఉంటాడు, జననమరణ ప్రవాహములో తిరుతుగూ ఉంటాడు. సాధనచేసి, శాస్త్రమును పరిశీలించి జపధ్యానములు చేసి మమకారమును తొలగించుకొన్నవాడు దేవుని స్వరూపమును పొందుతాడు.

మనం దృశ్యాలను ఆశ్రయిస్తాము. వ్యక్తులను ఆశ్రయిస్తాము. పదార్థాలను ఆశ్రయిస్తాము. మనం భగవంతుడిని ఆశ్రయించము. దీనివలన మనం బంధింపబడతాము. ఆత్మకాని దానిని ఆశ్రయించవద్దు. వస్తువులు మనకు ఎంతవరకు అవసరమో అంతవరకు ఉపయోగించుకోవాలి. కాని మమకారం ఏమిచేస్తుంది అంటే అవసరమైన వస్తువులకంటే ఎక్కువ పోగుచేసుకోవాలని అనిపింపచేస్తుంది. ప్రకృతివస్తువులను దేనిని ఆశ్రయించవద్దు. దృశ్యాలను ఆశ్రయించవద్దు. వీటిని ఆశ్రయిస్తే దుఃఖంతప్పదు, అశాంతి తప్పదు, నీచిత్తంలో వికారం తప్పదు. ఎవడైతే బ్రహ్మమును ఆశ్రయిస్తున్నాడో వాడి చెవులలో శుభంపడినా, అశుభం పడినా వాడి మనస్సులో వికారం రాదు. భగవంతుని పాదాలను ఆశ్రయించకుండా మనం మాయలో నుండి విడుదల పొందలేము. వేదంలో ఒకమంత్రం ఉంది. దాని అర్థం ఏమిటి అంటే ఓ సర్వేశ్వరుడా! నీవు ఎంతటి వాడివో నాకు అర్థం కాలేదు. నీవు ఎంతటివాడివో నాకు అర్థం

కానప్పుడు నీవు చెప్పేమాటల మీద నాకు గౌరవం ఏముంటుంది. అందుచేత నీవు చెప్పే మాటలను ఆచరించలేదు. ఆమాటలయొక్క బరువు తెలియక ఆచరించలేదు. నీవు చెప్పే మాటలను శ్రద్ధగా వినకపోవటం వలన కొన్ని పొరపాట్లు చేసాము. చేయాలని చేయలేదు. నీమాటయొక్క శక్తి అర్థం కాక పొరపాట్లు చేసాము. కాబట్టి మమ్మల్ని శిక్షించకు, మమ్మల్ని క్షమించు. అంతేకాదు నీమాటయొక్క శక్తిని అర్థంచేసుకొనే బుద్ధిపటిమను మాకు కలుగజెయ్యి. నీఅనుగ్రహం లేకుండా, నీదయలేకుండా నీమాట మాకు అర్దంకాదు. నీవు మమ్మల్ని అనుగ్రహిస్తేనే మాకు జ్ఞానం కలుగుతుంది. అందుచేత నీమాటను అర్థంచేసుకొనే శక్తిని మాకు కలుగజెయ్యి అని వేదంలోని ప్రార్థన యొక్క అర్థం.

భగవద్గీతలో 18 అధ్యాయాలు ఉన్నాయి. 11వ అధ్యాయం విశ్వరూప సందర్శనయోగం. మిగతా 10 అధ్యాయాలలో కృష్ణుడు ఎన్నిమాటలు చెప్పిన 11వ అధ్యాయంలో భగవంతుడు విశ్వరూపం చూపించిన తరువాతే అర్జునుడికి అహంభావన పూర్తిగా తగ్గింది. విశ్వరూప సందర్శనయోగం గొప్పతనం ఏమిటంటే భగవంతుడు ఎట్టివాడో, ఆయన స్వరూపం ఎటువంటిదో, ఆయన ఎంతగొప్పవాడో ఆ అధ్యాయంలో తెలుస్తుంది. అర్జున విషాదయోగం చాలాముఖ్యం. యుద్ధం జరిగేముందు అర్జునుడికి విషాదం వచ్చింది. ఆవిషాదంలో నుండి వైరాగ్యం కలిగింది. ఇదేసమయం అనుకొని కృష్ణుడు గీతను బోధించాడు. మనకు విషాదం వస్తే రోగం అవుతుంది. ఎందుచేతనంటే మనగురించే మనకు విషాదం, దుఃఖం వస్తుంది. కాని అర్జునుడు ఇతరుల గురించి ఆలోచించాడు. అందుచేత అతని విషాదం యోగం అయ్యింది. మీకు వైరాగ్యం లేకపోతే మీరు ఎన్ని జపాలు, ధ్యానాలు చేసినా జ్ఞానంరాదు. జ్ఞానానికి పునాదివైరాగ్యం. మానవుడికి ఎంతవరకు వైరాగ్యం ఉంది, ఎంతవరకు అనాత్మను విడిచిపెట్టాడు అనే దాని మీద జ్ఞానం ఆధారపడి ఉంటుంది. మనకంటే అతీతమైన శక్తి ఒకటి ఉంది అని మనం గ్రహించినప్పుడు అహంభావన నశిస్తుంది గాని లేకపోతే అహంభావన నశించదు. విశ్వరూపసందర్శనం చూపించటానికి కారణం అది అంతేగాని ఆయన గొప్పత నం చూపించటానికి కాదు. నన్ను ఒక్కడినే నీవు శరణు వేడుకో అని చెపుతాడు అలా శరణువేడుకొంటే ఆయన అనుగ్రహం వచ్చి మన అహంకారాన్ని మింగేస్తుంది. ఏవస్తువుకయితే చావుపుట్టుకలు లేవో, నాశనంలేదో ఆవస్తువును ఆశ్రయించు. దృశ్యాలను ఆశ్రయించవద్దు. ఎప్పుడూ తృప్తిగాఉండు. ఆనందంగా ఉండు. నిత్యం తృప్తిగా ఎవడు ఉంటాడు అంటే ఎవడిక యితే లోపల ఆత్మదర్శనం అయ్యిందో వాడు నిత్యం తృప్తిగా ఉండగలడు. మీహృదయంలో ఉన్న ఆనందం, శాంతి మీకు అనుభవంలోనికి వచ్చింది అనుకోండి జీవితం పొడుగునా సంతృప్తే అసంతృప్తి ఏమీ ఉండదు.

మీరు భగవద్గీత చదవండి, ఉపదేశసారం చదవండి. మీరు ప్రేమతో, పరమేశ్వరుని పట్ల పరిపూర్ణమైన విశ్వాసంతో జాగ్రత్తగా ఆశబ్దాలను చదువుతూ ఉంటే, ఆమాటలను చూస్తూ ఉంటే ఆశబ్దం తప్పకొంటుంది అందులో ఉన్న అర్థం మీగుండెకు తాకుతుంది. గ్రాంఫోన్ రికార్డులా చదివితే భగవంతుడు మీకు తెలియబడడు. ఈశ్వరుడికి ఎంతగౌరవం ఇస్తున్నారో

ఆమాటకు కూడా అంతగౌరవం ఇచ్చి చదవగా చదవగా ఆమాట తప్పకొంటుంది. దానిలోపల ఉన్న అర్థం మీకు దర్శనం ఇస్తుంది. అప్పడు మీకు జ్ఞానం కలుగుతుంది. మెకానికల్‌గా చేయకూడదు. ఆలోచన అవసరం. ఆలోచనకూడా తపస్సుతో సమానము.

తల్లి కడుపులో ఉండగా జీవుడు అనుకొంటాడు బయటకు వచ్చాక భగవంతుని పాదాలను ఆశ్రయించి సాధనచేసి మరల గర్భవాసం రాకుండా చేసుకోవాలని అనుకొంటాడు. కాని బయటకు వచ్చాక మాయలోపడిపోతాడు. నాపాదాలను ఆశ్రయించకుండా, నాయందు దైవభావన లేకుండా నామాయను ఎవరూ జయించలేరు అని భగవంతుడు గీతలో చెప్పాడు. నీమనస్సు ఎంతసేపు బాహ్యంగా వెలుతుందిగాని లోపలకు వెళ్లదు. పెద్దలమాటలు వినటం వలన మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. నీహృదయంలో బ్రహ్మం ఉంది. నీ హృదయంలో ఏదైతే ఉందో దానిని తెలుసుకోవటానికి నీకు సహాయపడేవాడే గురువు. నీహృదయం యొక్క లోతులను పెంచేవాడే గురువు. కర్ణమౌనం, నేత్రమౌనం అని శాస్త్రంలో చెపుతారు. కర్ణమౌనం అంటే బ్రహ్మానుభవం పొందటానికి ఉపయోగపడని మాటలు వినకూడదు. నేత్రమౌనం అంటే బ్రహ్మానుభవం పొందటానికి ఉపయోగపడని దృశ్యాలను చూడకూడదు. మీమనస్సులో ఎన్నిలోపాలు ఉన్నా ఆత్మజ్ఞానం కలిగితే అన్నీ కాలిపోతాయి, ఆత్మజ్ఞానం యొక్క వైభవం అటువంటిది. ఆస్థానంలో ప్రకృతియొక్క ఆటలు, కామంయొక్క ఆటలు సాగవు. అది ఆత్మశాంతి. మీకు శ్రద్ధ లేదు అనుకోండి ఇవి అన్ని పాడిపాడి మాటలుగా అనిపిస్తాయి. శ్రద్ధలేకుండా జ్ఞానం కలుగదు. ఇటువంటి మాటలు వినగా వినగా కొంతకాలానికి శ్రద్ధ కలుగుతుంది.

వేదంలో బ్రహ్మమును సత్యం, జ్ఞానం, అనంతం అనిచెప్పారు. దానికి చివర మొదలు లేదు. అది అనంతం. జ్ఞానం అంటే మనస్సుతో గ్రహించేదికాదు. ఆవస్తువుకు తాను ఉన్నానన్న సంగతి దానికి తెలుస్తూ ఉంటుంది. అది ఆత్మాజ్ఞానం. సత్యం అంటే వ్యవహారిక సత్యంకాదు. సర్వకాల, సర్వావస్థలలో దేహం కనిపించినా కనిపించకపోయినా, ఈసృష్టి ఉన్నా లేకపోయినా పంచ భూతములతో సంబంధం లేకుండా, చావుపుట్టుకలతో సంబంధం లేకుండా, కష్టసుఖా లతో సంబంధం లేకుండా ఈద్వంద్వాలతో సంబంధంలేకుండా ఏదైతే ఉంటుందో అదే సత్యం. అదే నిత్యం. అదే నిర్వాణం. అక్కడ జీవుడు యొక్క ఆటలు ఉండవు. నీవు ఆస్థితిని పొందినప్పడు ఏవిషయాలయితే నీమనస్సును కలవరపెడుతున్నాయో, ఏదైతే కష్టం కష్టం అని నీమనస్సుకు అనిపిస్తోందో ఆకష్టాలయొక్క ఆటలు, విషయాలయొక్క ఆటలు, భోగాలయొక్క ఆటలు అక్కడసాగవు. ఆత్మజ్ఞానములో ఆ ఆటలు సాగవు. సత్యవస్తువులో కాలం లేదు. కాని మనకు మూడు కాలాలు చెపుతారు. భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్‌కాలం. దేహం ప్రారబ్దం అనుభవించటానికి వచ్చింది కాబట్టి దేహం స్మశానానికి వెళ్లేవరకు ఏదో ఒక సంఘటన జరుగుతూ ఉంటుంది. జరిగిపోయిన సంఘటనలను తలపెట్టుకోవద్దు. జరిగిపోయిన సంఘట నల నుండి పాఠాలు నేర్చుకోవాలి. అది భూతకాలం నుండి నేర్చుకోవలసింది. జరిగిపో యిన సంఘటనల నుండి ఏమి నేర్చుకొన్నాము అని చూసుకోకపోతే ఎన్ని ఏళ్ళు జీవించినా ఒక్కటే. వర్తమానకాలం మనచేతిలో ఉంది. భగవంతుడిలో ఐక్యం అవ్వటంకోసం ఈకాలాన్ని

ఎంతవరకు సద్వినియోగం చేసుకొంటున్నాము అని చూసుకోవాలి. అది వర్తమానకాలానికి సంబంధించినది. మనలో ఇన్ని వాసనలు ఉన్నాయి. భవిష్యత్‌లో వీటినుండి విడుదల పొందాలి అని చూసుకోవాలి.

సత్యవస్తువు మన హృదయంలో ఉన్నప్పటికి మనకు అనుభవంలోనికి రాకపోవటానికి కారణం మనవాసనలే. ఒకమనిషి ఏదైనా వాసనతో బాధపడుతూఉంటే ఆయన మీద కోపం నటించి ఆమనిషిని కదిపి, ఊపి. కడిగి విడిచిపెట్టేవారట భగవాన్. అలా అని భగవాన్‌కు ఆయన మీద ప్రేమలేదు అని కాదు ఆవాసన నుండి విడుదల చేయటం కోసం అలాచేసేవారు లేకపోతే ఆవాసన కొన్ని వేలజన్మలను తీసుకొనివస్తుంది. సాధనకు సహకరించే ఎన్నో ఉపాయాలు, సూచనలు గీతలో 6వ అధ్యాయంలో భగవంతుడు చెప్పాడు. కర్మఫలం మీద మనస్సు పెట్టకుండా ఎవడైతే కర్మచేస్తున్నాడో వాడు సన్యాసి, వాడు నిత్యసన్యాసి. జ్ఞానం సంపాదించాలనే కాంక్ష లేకుండా బాహ్యకారణాలవలన నీవు బట్టలు మారిస్తే అది సన్యాసం కాదు. వారు అనిత్యసన్యాసులు. వారికి జ్ఞానం అక్కరలేదు. కర్మఫలాన్ని ఆశించకుండా కర్మచేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది, జ్ఞానం కలుగుతుంది. నీవు చేసే పనికి నీదేహం కనుక కేంద్రం అయితే అధ్యాత్మికంగా ఒక్క అడుగుకూడా ముందుకు వెళ్ళలేవు. మీ సాధన వలన వాసన నశించాలి. మనంబాహ్యంగా ఇతరులకు సహాయం చేయలేకపోవచ్చును కాని ఇతరులకు ఉపకారం చేయాలనే బుద్ధి మనకు ఉంటే అది మనోనిగ్రహానికి, ఇంద్రియనిగ్రహానికి సహాయ పడుతుంది.

నేను ప్రపంచమునకు సహాయం చేయాలనుకొంటున్నాను. నన్ను ఏమిచేయమంటారు అని భగవాన్‌ను అడిగితే ప్రపంచానికి తరువాత సహాయం చేయవచ్చును ముందు ఆనేనును పోగొట్టుకో. నేను సహాయం చేయాలనుకొంటున్నాను అని చెపుతున్నావు కదా ఆనేనును పోగొట్టుకో. ఆనేనును పోగొట్టుకొంటే ప్రపంచానికి సహాయం చేయాలని నీవు అనుకోన క్కరలేదు నీద్వారా ప్రపంచానికి సహాయం జరుగుతుంది. ఆదోషగతమైన నేనుతో ప్రపంచానికి ఏమీ చేయలేవు. దోషగతమైన నేనుపోతే నీద్వారా ప్రపంచానికి మేలు జరుగుతుంది. నీవు ఎంతవరకు బాగుపడితే, నీచైతన్యస్థాయి ఎంతవరకు పెరిగితే అంతవరకు నీద్వారా లోకానికి మేలు జరుగుతుంది. మీకు భక్తిభావన ఎప్పుడు కలిగింది అని భగవాన్‌ను అడిగారు. యాధా లాపంగా పెరియపురాణం అనే శివభక్తుల చరిత్రలు చదివాను. అప్పుడు నాకు అనిపించింది ఆభక్తులలో కనీసం ఒక్కడిగానైనా నేను అవ్వగలనా అని అనుకొన్నాను. అప్పుడు భక్తి భావన ఉదయించింది అనిచెప్పారు. ఉపాసన లేకపోతే మీలో ఉన్న వాసనల నుండి బయటపడటానికి మీశక్తి సరిపోదు. ఉపాసనాబలం వలన శక్తి వస్తుంది. ఆశక్తి వలన వాసనల నుండి విడుదల పొందుతారు. మీరు 30 నిమిషాలు ధ్యానంలో కూర్చొంటే ఒక్క నిమిషం మీకు ధ్యానం కుదిరినా మీరు తరించటానికి అది సహకరిస్తుంది.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL